


మనదే విజయం : టీడీపీ జెండాతో మహిళ



మీరే మా దైవం : ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న చంద్రబాబు నాయుడు



ఇది నా టీమ్ : వేదికపై చంద్రబాబుతో గోరంట్ల, యనమల, చినరాజప్ప, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, మద్దిపాటి, కందుల దుర్గేష్, జోన్-2 కో-ఆర్డినేటర్ మందలపు రవి, ప్రత్తిపాటి, బాపిరాజు, ఆర్ఎస్, యర్రా, హరీష్‌మాధుర్, బండారు తదితరులు



మీకు నేనున్నా : రాజమహేంద్రవరంలో జరిగిన రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

జన గోదారి

తెలుగుదేశం పిలిచిందని.. కదిలొచ్చిన జనం

- జనచంద్రమైన రాజమహేంద్రి
- వేలాది వాహనాల క్యూ
- లక్షలాదిగా జన ప్రవాహం
- దారులుగా మారిన చేల గట్లు
- కిక్కిరిసిపోయిన కాతేరు
- గామన్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్
- టీడీపీ, జనసేన జెండాల హోరు
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జనం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/అర్బన్/రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం/కొవ్వూరు/తాళ్లపూడి, జనవరి 29: గోదావరి తీరం.. జనగోదారిగా మారిపోయింది.. రాజమహేంద్రవరం నగరానికి జనం పోటెత్తారు. దారులన్నీ జనదారులుగా మారిపోయాయి. వాహనాలు కిలోమీటర్ల లెక్కన బారులు తీరాయి. ఎటుచూసినా, ఎక్కడ చూసిన జనమే. చేల గట్లు రహదారులయ్యాయి. రా కదలిరా సభా ప్రాంగణం అంతా జై టీడీపీ, జై జనసేన నినాదాలతో హోరెత్తింది. చంద్రబాబు 'రా.. కదలిరా' సభ జన 'చంద్ర'మైంది. మహిళాలోకం వెల్లువలా తరలివచ్చింది. వయసు పైబడిన పెద్దలు సైతం ఉత్సాహంగా కదలి వచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు "తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా" సభ నిర్వహించారు. సభ జరిగే ప్రదేశం చంద్రబాబు రాకకు రెండు గంటల ముందే జనంతో కిట కిటలాడింది. చంద్రబాబు సభను విశాలమైన మైదానంలో ఏర్పాటు చేసినా జన ప్రభంజనంతో నిండిపోయింది. సభా ప్రాంగణం కాతేరు ప్రధాన రహదారి పక్కనే ఉన్నా ఎటు చూసినా జనంతో నిండిపోవడంతో పొలం గట్లతో సహా అందుబాటులో ఉన్న అన్ని దారుల్లోనూ పసుపు దండు, జనసైనికులే కనిపించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలే కాకుండా, మిగిలిన జిల్లాల నుంచి కార్లు, బైక్‌లు, బస్సులు, ఆటోలు చివరకు సైకిళ్లపై కూడా టీడీపీ, జనసేన కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి 30 వేల మంది వస్తారని అంచనా వేయగా దాని తగినట్లుగానే తరలివచ్చారు. టీడీపీ, జనసేన జెండాలతో సభా ప్రాంగణం కళకళలాడింది.. జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్, జై తెలుగుదేశం, జై జనసేన అంటూ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభం అయ్యే సమయానికి ఇటు కొవ్వూరు, కొంతమూరు, నాలుగోబ్రిడ్జి రోడ్డు, కాతేరు, సీతానగరం రోడ్డు, వాహనాలతోను, కార్యకర్తల ప్రదర్శనలతోను కిక్కిరిసింది.భారీ స్థాయి ఊరేగింపులు జరిగాయి.. రూరల్ మండలం ధవళేశ్వరం నుంచి, కడియం, రాజానగరం, సీతానగరం, రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ మండలాలతో పాటు అటు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి తదితర మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు భారీ ప్రదర్శనలు నిర్వహిస్తూ కాతేరు చేరుకున్నారు. దీంతో ఆయా రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. సభ ముగిసిన తరువాత సుమారు గంట పాటు రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. అటుపై మధ్యాహ్నం 2-30, 3 గంటల మధ్య సాధారణ స్థితికి వచ్చింది. స్థానిక లూథర్‌గిరి కాంపౌండ్ నుంచి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెకటరీ ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగాన్ని జనం తదేకంగా విన్నారు. ప్రధానంగా మహిళలు చంద్రబాబును చూడడానికి ఉత్సాహం చూపించారు. నాయకులు ఊహించినదానికంటే జనం భారీగా తరలిరావడంతో కొన్ని చోట్ల ఫెక్సీలను సైతం పక్కకు పెట్టాల్సి వచ్చింది. ఎండ కాస్త ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా చంద్రబాబు స్పీచ్ వినడానికి ఆసక్తి చూపించారు. చంద్రబాబు సైతం జనాలను ఉత్సాహపరుస్తూ అధికార పార్టీని కడిగిపాడేశారు. మధ్యమధ్యలో జగన్‌పై ఆయన పేల్చిన హాస్యపు తూటాలకు జనం కేరింతలు కొట్టారు. పెద్ద సంఖ్యలో రెపరెపలాడిన టీడీపీ, జనసేన పార్టీల జెండాలు గెలుపు మనదే అన్నట్లుగా ఉండడంతో తెలుగు తమ్ముళ్ళ, జనసైనికుల్లో గోదారిలా ఉత్సాహం ఉప్పొంగింది. భారీగా తరలివచ్చిన జనం ఇబ్బందిపడకుండా వందలాది ప్యాకెట్ల మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లు, బస్తాలకొద్దీ వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలోనూ వివిధ ప్రాంతాల నుంచి జనం సభకు వస్తూనే ఉండడం గమనార్హం. ప్రవేశ ద్వారాలు ఎక్కువగా ఏర్పాటు చేయడం, ప్రాంగణం విశాలంగా ఉండడం, పార్కింగ్ ప్రణాళికాబద్ధంగా ఉండడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు. చంద్రబాబు వెళ్లిన తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ట్రాఫిక్‌ని నాలుగో వంతెన మీదుగా మళ్లించడంతో పెద్దగా సమస్య రాలేదు. మొత్తం మీద రా కదలలిరా సభ విజయవంతమైంది.

వైసీపీ నాయకులే కౌరవులు..

జగన్ సభలో కౌరవులు, పాండవులుగా మాట్లాడారు. వాస్తవానికి జగన్ గ్రహించాల్సి ఒకటుంది. పాండవులనే వారు టీడీపీ జనసేన కూటమే. కౌరవులు వైసీపీ నాయకులు. జగన్‌కి రామ్‌గోపాల్ వర్మ నిర్మించిన వ్యూహం సినిమా గురించి తెలుసు.. కానీ పద్మవ్యూహం గురించి తెలుసుకోవాలి.మడుగులో దాగున్న దుర్యోధనుడు జగన్. వైసీపీ అనేది ఇంపోర్ట్ ఎక్స్‌పోర్టు కంపెనీగా తయారైంది. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను దోచేశారు. అన్ని వ్యవస్థలనూ సర్వనాశనం చేశారు. ఇసుక, మట్టి మాఫియా... ఇలా అన్ని వ్యవస్థల్లోను డబ్బులు నొల్లుకున్నారు. ఈ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దాపురించాయి. టీడీపీ జనసేన కూటమి విజయబావుటా ఎగురవేయడం ఖాయం.

- కందుల దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు

దళిత ద్రోహి జగన్...

నాలుగేళ్ల తొమ్మిది నెలల జగన్ పాలనలో ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణచి వేసి జగన్ దళితద్రోహిగా మారాడు. ఇటీవల భీమిలిలో జరిగిన సభలో క్రాస్ ముద్రణపోలిన ర్యాంపు వేసి బూట్లు, చెప్పులు ధరించిన కాళ్ళతో ఆ క్రాస్‌పై నడుస్తూ క్రైస్తవ్యాన్ని అపహాస్యం చేశాడు. భారత రాజ్యాంగానికి ఈ రాష్ట్రంలో తూట్లు పొడిచాడు. ఎస్సీఎస్టీ మైనారిటీలను దగా చేశాడు. మాస్క్ అడిగిన డా. సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు మారణకాండను సృష్టించాడు. దళితజాతి ఆత్మగౌరవం నిలబడాలంటే టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే

జగన్‌ను ఇంటికి సాగనంపాలి

టీడీపీ హయాంలో 6,200 ఇళ్ళు కడితే వాటికి రంగులు మార్చాడే తప్ప వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా తూట్లు పొడిచాడు. జలజీవన్ మిషన్ రద్దు చేశాడు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. బలహీన వర్గాలకు దగా చేశాడు. అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న జగన్‌ను ఇంటికి సాగనంపాలి.

- కేఎస్ జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



జై బాబు : టీడీపీ జెండాతో మహిళ నినాదం



కిక్కిరిసిన కాతేరు రోడ్డు



వెల్‌కమ్ సార్ : వేదికపై చంద్రబాబుకు నమస్కరిస్తున్న నాయకులు



వచ్చేశాం : సభకు తరలివచ్చిన కొవ్వూరు టీడీపీ, జనసేన నాయకులు



మేం సైతం : నిడదవోలు నుంచి వెళుతున్న నాయకులు



బాబును కలుద్దామని : సభ వద్ద ముప్పాళ్ల, ఇతర న్యాయవాదులు



మీ కోసం వచ్చాం : సభా వేదిక వద్ద టీడీపీ జెండాలతో మహిళలు



బాబుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, దుర్గేష్



నీవే మా రాజు : బాబుకు కిరీటం



మొక్కను ఇస్తున్న హరీష్, ఆదిరెడ్డి వాసు



బాబుతో జ్యోతుల నెహ్రూ



బాబుకు వరి కంకులు, నాగలి ఇస్తున్న చంటి



పుష్పగుచ్ఛమిస్తున్న బత్తుల

నేటినుంచి లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు

జీజీహెచ్(కాకినాడ), జనవరి 29: జాతీయ కుష్టు (లెప్రసీ) నివారణలో భాగంగా ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్టు అవగాహన పక్షోత్సవాలను క్షేత్ర స్థాయిలో గ్రామ సచివాలయం, వార్డు పరిధిలో నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ రేణంకి రమేష్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కృతికాశుక్లా ప్రారంభిస్తారని, గ్రామస్థాయిలో సంబంధిత సర్పంచ్‌లు ప్రారంభించి వారి సందేశంతోపాటు కుష్టు వ్యాధిగ్రస్తుడు తన అనుభవాలు వ్యాధిపట్ల, బహుళ ఔషధ చికిత్స ద్వారా ఎలా అంగవైకల్యం రాకుండా జాగ్రత్తలు చెప్పడం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు, మచ్చలు ప్రారంభంలోనే గుర్తించడంద్వారా వ్యాధిని, అంగవైకల్యం అరికట్టవచ్చన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టువ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ వారం ఉదయం 9 గంటలకు విముక్తికాలనీలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణ దినోత్సవం ప్రారంభమౌతుందన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు. బహుళ ఔషధ చికిత్సలో 2023-24కుగాను 74మంది కుష్టు వ్యాధిగ్రస్తులను నమోదు చేశామన్నారు. జిల్లాలో ఉన్న నాలుగు లెప్రసీ కాలనీల్లో ఉన్న 67మంది వ్యాధిగ్రస్తులు పుండ్ల బారిన పడకుండా ఎంసీఆర్ చెప్పులు, దూది, గాజుగుడ్డలు, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న 1457మంది ఆశాకార్యకర్తలకు కుష్టువ్యాధిపై అవగాహన శిక్షణ ఇచ్చామన్నారు. ఇటీవల జరిగిన సర్వేలో 20మంది కొత్త వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించామన్నారు.

చెత్తను తొలగించాల్సిందే

- హైకోర్టు ఆదేశాలతో దిగొచ్చిన అధికార యంత్రాంగం
- ఎంఎస్ఎన్ చారిటీస్ గ్రౌండ్‌లో డంపింగ్ యార్డ్ చెత్త,చెదారం తొలగింపు ప్రారంభం



ఎంఎస్ఎన్ చారిటీస్ గ్రౌండ్‌లో డంపింగ్ యార్డ్ చెత్త తొలగింపు పనులు

కాకినాడ సిటీ, జనవరి 29: కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ గ్రౌండ్‌లో వేసిన డంపింగ్ యార్డ్ చెత్తను తొలగించాల్సిందేనని హైకోర్టు ఆదేశించింది. దీంతో అధికార యంత్రాంగం దిగొచ్చింది. కాకినాడ జగన్నాథపురంలోని మల్లాడి సత్యలింగం నాయకర్ ఛారిటీస్ విద్యాసంస్థ ప్రాంగణంలో వేసిన చెత్త చెదారంతో కూడిన మట్టిని తొలగించే చర్యలు చేపట్టింది. ఈ పనులు కూడా అధికారుల ప్రమేయం లేకుండా ప్రైవేటు వ్యక్తుల ద్వారానే జరుగుతున్నాయి. మూడునెలల క్రితం ఈ ప్రాంగణాన్ని డంపింగ్ యార్డ్‌నుంచి తెచ్చిన చెత్త చెదారం, ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులతో కూడిన మట్టితో నింపడంపై పూర్వ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పట్లో ఈ పనులు ప్రైవేటు వ్యక్తుల ద్వారానే జరిగాయి. రాత్రుళ్లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో టిప్పర్లతో తెచ్చిన డంపింగ్ యార్డ్ మట్టిని ఈ ప్రాంగణంలో వేసి చదును చేసే పనులు యథేచ్ఛగా కొనసాగించారు. వేదపాఠశాల, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల సముదాయం తో కూడిన ఈ ప్రాంగణంలో దుర్గంధ భరితమైన చెత్త, చెదారంతో మెరక చేయడాన్ని నిలుపుదల చేయించాలని పూర్వ విద్యార్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ 26845/2023 వేశారు. దీనిపై అధికారులను వివరణ కోరుతూ గతేడాది అక్టోబరు 11న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారం కాస్తా రాజకీయ రంగు పులుముకోవడంతో ఓ ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో ఈ ప్రాంగణంలో వేసిన చెత్తపై గ్రావెల్ వేసి చదును చేయించారు. దీనిపై పూర్వ విద్యార్థులు మళ్లీ హైకోర్టులో కంటెమ్ట్ ఆఫ్ కోర్టు సీసీ పిటిషన్ నెం.6483/2023 వేశారు. దీంతో కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని గతేడాది డిసెంబర్ 14న జిల్లా కలెక్టర్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్‌లకు వ్యక్తిగత పేర్ల మీద నోటీసులు జారీ అయ్యాయి. ఈ వ్యవహారం కలెక్టర్, కమిషనర్‌ల మెడకు చుట్టుకోవడంతో ఎండోమెంట్స్‌కు చెందిన ఎంఎస్ఎన్ చారిటీస్ పాఠశాల ప్రాంగణంలో ఎవరో వేసిన మట్టితో తమకు సంబంధం లేదని కోర్టుకు విన్నవించుకునే పనిలో పడ్డారు. మట్టిని వేసేటప్పుడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు పాఠశాల ప్రాంగణంలో పగలు, రాత్రుళ్లు యథేచ్ఛగా రాకపోకలు సాగించాయి. ఇప్పుడు మట్టి తొలగించేటప్పుడు అవి అలాగే తిరుగుతున్నాయి.

జిల్లాస్థాయి 'స్పందన'కు 398 అర్జీలు

కాకినాడ సిటీ, జనవరి 29: జగనన్నకు చెబుదాం-జిల్లాస్థాయి స్పందనకు 398 అర్జీలు అందాయి. కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఇలాక్కియ, ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, డీపీవో కె.భారతి సౌజన్య, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ 'స్పందన'కు 65 అర్జీలు

కాకినాడ క్రైం జనవరి 29: జిల్లావ్యాప్తంగా 65మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరై తమ గోడును విన్నవించారు. ఎస్పీ వారి సమక్షంలో సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదు సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాకినాడకు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా అర్జీదారులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు. స్పందనకు 21 సివిల్ తగాదాలు, 13 కుటుంబ తగాదాలు, ఇతర సమస్యలకు సంబంధించి 31 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. (ఏఆర్) అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, దిశ ఇన్‌స్పెక్టర్ పెదిరెడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా కృష్ణకాంత్ పాటిల్



సర్పవరం జంక్షన్(కాకినాడ), జనవరి 29: రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా కర్నూలు సెబ్ అడిషినల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్‌ను నియమించారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న సీహెచ్ విజయరావును బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీగా నియమించారు.

టీడీపీ, జనసేనదే విజయం

● రా కదలిరా సభలో నేతలు ● ప్రభుత్వ విధానాలపై ధ్వజం

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం: జనవరి 29 : కాతేరులో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభలో టీడీపీ, జనసేన ముఖ్య నేతలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిల అధ్యక్షతన సభ ప్రారంభమైంది. చంద్రబాబునాయుడు రాకకు ముందే ముఖ్య నాయకులు కొందరు సభలో మాట్లాడారు.

ఏ వర్గం సంతోషంగా లేదు

అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. గోదావరి చెంతనే ఉన్నా జిల్లా రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. మొదటి పంటకు నీరివ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, ఇక రెండో పంట పరిస్థితి దారుణం అన్నారు. ధాన్యం కొనుగోలు మోసపూరితం అని, రైతుల సొమ్ములను వైసీపీ ప్రజాప్రతినిధులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ అంటే రెడ్ల పార్టీ అని నమ్మించి మోసం చేశారని, ఈవేళ రెడ్లే జగన్ పేరు చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 165 స్థానాల్లో విజయం సాధించడం ఖాయం అన్నారు.

ఏపీలో రాజకీయ సంక్షోభం

అనపర్తి జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రాక్షస పాలన సాగుతోందని, దీన్ని అంతమొందించేందుకు టీడీపీ, జనసేనలు కలిసి క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలన్నారు. 151 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేస్తున్న జగన్ ఇటు 1 కానీ, అటు 1 కానీ పోయి 15, లేదా 51 సీట్లకు పరిమితమవుతాయన్నారు.

ప్రజల తిరుగుబాటుతో జగన్‌కు వణుకు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎప్పుడు దిగిపోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజల తిరుగుబాటుకు జగన్ భయపడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన ఈ రాక్షస ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధిస్తోందన్నారు.

దుష్టపాలనను అంతమొందించాలి

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ దుష్టపాలనను అంతమొందించి రాష్ట్రాన్ని రక్షించేందుకు టీడీపీ, జనసేనలు ఏకమయ్యాయని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు చరిత్ర సృష్టించబోతున్నారని, విజయం తథ్యమని అన్నారు.

వైసీపీకి డిపాజిట్లు రావు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. సహజ వనరులను, సంపదను వైసీపీ ప్రజాప్రతినిధులు భక్షించారన్నారు. ఇసుక, మట్టి పేరిట దోపిడీలు చేశారని.. ఆవ భూముల పేరుతో దోచేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ కక్కిస్తామన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో టీడీపీ యువత ఆవేశం కట్టలు తెంచుకుంటే అదుపు తప్పకుండా తమ నాయకుడు లోకేశ్ చాలా సమయస్ఫూర్తితో లీడ్ చేసి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. టీడీపీ జనసేనలు అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరుగుతుందని, బీసీ రక్షణ చట్టం వస్తుందని స్పష్టంచేశారు.



మాట్లాడుతున్న చంద్రబాబు..సభకు హాజరైన ఉమ్మడి జిల్లా నేతలు

యువతకు ఉద్యోగాలు ఏవీ?

రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ యువతకు జగన్ ఉద్యోగాలు ఇవ్వలేదుగానీ, మత్తును మాత్రం పెంచాడన్నారు. డ్రైవరు సుబ్రహ్మణ్యంను హత్యచేసిన ఎమ్మెల్సీని పక్కన కూర్చోబెట్టుకున్నారని, కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా చేశారని, బాబాయి హత్య కేసును విచారణ జరగకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.

బీసీలకు గుర్తింపునిచ్చే పార్టీ టీడీపీ

టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చిందే అన్న ఎన్టీఆర్ అని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎదగడానికి దోహదపడ్డారన్నారు. ఆ రిజర్వేషన్లను చంద్రబాబు పెంచి అమలు చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు విదేశీ విద్యనందించి ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఇస్తే, అదే బీసీ వర్గాలకు జగన్ మద్యం షాపుల్లో గుమస్తాలుగా, గ్రామాల్లో వలంటీర్లుగాను చేశాడన్నారు. టీడీపీ, జనసేన కూటమికి 170 సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

జగన్‌ది రాక్షస పాలన

గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం ముందు-తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారిందని, అభివృద్ధి పథంలో ఉన్న ఆంధ్రరాష్ట్రంలో 42 ఏళ్ల తరువాత రాక్షస పాలన జగన్ రూపంలో వచ్చిందన్నారు. దీన్ని అంతమొందించేందుకు రా.. కదలిరాకు చంద్రబాబు పిలుపునిచ్చారని తెలిపారు. మోసపూరిత హామీలతో జగన్ మహిళల నెత్తిన చెయ్యి పెట్టారని, మద్యపాన నిషేధం అంటూ మహిళల తాళిబొట్లు తెంపేశాడన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేనలు కలిశాయని స్పష్టంచేశారు.

అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చేశారు

గోపాలపురం జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ అన్యాయంగా చంద్రబాబును 52 రోజులు జైలులో పెట్టి ఆధారాలు లేని కేసులో కక్షసాధింపులకు పాల్పడిన జగన్ ఆనాడే తన రాజకీయ పతనానికి నాంది పలికాడన్నారు. చంద్రబాబును పరామర్శించిన పవన్‌కల్యాణ్ ఆరోజు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఇరుపార్టీలు జగన్ పాలనపై పోరాడుతున్నాయన్నారు. నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో జగన్ రూ.9 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారాన్ని మోపాడని ధ్వజమెత్తారు.

ఈ సభలో టీడీపీ జనసేన నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ, రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, శిష్టా లోహిత్, కాశి నవీన్‌కుమార్, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి, బండారు సత్యానందరావు, గంటా మురళి, పిల్లి అనంతలక్ష్మి, మాజీ మేయర్ పంతం రజనీశేషసాయి, కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, జోన్ 2 కోఆర్డినేటర్ మందలపు రవి, చెల్లుబోయిన శ్రీను, నాయకులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, గట్టి నర్సయ్య చెరుకూరి రామారావు, నున్న కృష్ణ, పంతం గణపతి, గంగిన హనుమంతరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గంగిన రంగయ్యచౌదరి, వాసిరెడ్డి రాంబాబు, వరగోగుల వెంకటేశ్వరరావు, పితాని శివ, మజ్జి పద్మ, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నన్నయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి గౌరవ డాక్టరేట్
- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఉపకులపతి పద్మరాజు వెల్లడి



వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 29: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జరిగే ఈ కార్యక్రమంలో వీసీతో పాటు గవర్నర్ అబ్దుల్‌నజీర్ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మభూషణ్ సుధామూర్తి హాజరవుతారని, ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని చెప్పారు. నన్నయ యూనివర్సిటీలో 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. ఈ 13, 14, 15వ స్నాతకోత్సవాలకు వివిధ కోర్సులుకు చెందిన 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12 మిగిలిన వారు పీజీ కోర్సులు, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారు ఉన్నారని తెలిపారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో పీజీ పూర్తి చేసిన 8582, యూజీ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారన్నారు. అతిథులుగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. స్నాతకోత్సవానికి సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

గైట్‌లో హెలిప్యాడ్ పరిశీలన



హెలిప్యాడ్ పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం, జనవరి 29: గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆదికవి నన్నయ విద్యాలయంలో ఈ నెల 31న జరగనున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక సందర్భంగా గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను వారు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ కిశోర్‌కుమార్, రాజానగరం సీఐ పి.కాశీ విశ్వనాథ్, తహశీల్దార్ పవన్‌కుమార్, నన్నయ వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్ సుధాకర్, గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శర్మ, ఎన్‌సీసీ ఏఎన్‌వో ఏ.తేజేశ్వరరాజు పాల్గొన్నారు.

ఒకే ఆధార్ లింక్‌తో 27 విద్యుత్ కనెక్షన్లు

ఆలమూరు, జనవరి 29: ఆయనో వ్యవసాయ కూలీ... కానీ ఆయన ఆధార్ నెంబరుతో ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 27 విద్యుత్ కనెక్షన్లు లింకై ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పథకాలు రావడం లేదు. లబోదిబోమని విద్యుత్ కార్యాలయానికి వెళితే 27 కనెక్షన్లు ఉన్నాయని అధికారులు చెప్పడంతో వాపోయాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన గంటా సింహాచలం దాదాపు 2,700 యూనిట్లు విద్యుత్ వాడుకున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. దీంతో రాయితీ పథకాలు వర్తించవని చెప్పారు. ఇదేమిటని ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి పరుగులు తీస్తే రామచంద్రపురం డీఈ ఆఫీసుకు వెళ్లమని చెప్పారు. సింహాచలం అక్కడికి వెళ్తే ఆధార్ నెంబరుతో 27 కనెక్షన్లు లింక్ చేసి ఉన్నాయని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. తనకు ఇన్ని మీటర్లు ఉండటమేమిటని ప్రశ్నించాడు. ఇలా ఎలా జరిగిందో తమకు తెలియదని, గ్రామ సచివాలయంలో ఒక్కో కనెక్షన్‌కు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే రద్దు చేస్తామని అధికారులు సెలవిచ్చారు. వారు తప్పు చేసి తనను డబ్బులు చెల్లించి కనెక్షన్లు రద్దు చేసుకోమనడం ఎంతవరకు న్యాయమని సింహాచలం వాపోయాడు.

మహిళపై హత్యాయత్నం: రెండేళ్ల జైలు

సర్పవరం జంక్షన్, జనవరి 29: తనతో సహజీవనం చేస్తున్న వివాహితపై అనుమానంతో హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి శివారు తాటూరు గ్రామానికి చెందిన 36 ఏళ్ల కాకాడ వెంకటరమణ అనే వ్యక్తి రమణయ్యపేట ఆర్టీసీకాలనీలో నివాసం ఉంటున్న వివాహితతో ఏడాది పాటు సహజీవనం చేశాడు. అనుమానం పెంచుకున్న వెంకటరమణ 26-10-2022వ తేదీన పిల్లల్ని మోటార్ బైక్‌పై స్థానిక రమణయ్యపేట మున్సిపల్ హైస్కూల్లో దింపి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో మార్గమధ్యంలో ఇనుపరాడ్డుతో వివాహితను తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ డానియల్ దినకర్ జాన్సన్ వాదించారు. కోర్టు కానిస్టేబుల్ బి.శ్యామలరావు ఎస్‌హెచ్‌వోను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

వేదికపై తూలిన చంద్రబాబు

వెనుక చెయ్యి పట్టి ఆపిన భద్రతా సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో రా.. కదలిరా సభకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు సభ ముగించుకుని వెళుతున్న క్రమంలో నేతల రద్దీతో సభా వేదిక కిక్కిరిసింది. ఈ క్రమంలో ఒకరిద్దరు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చే క్రమంలో కొంత మీదకు రావడంతో ఆయన తూలారు. అప్రమత్తమైన ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెనుక నుంచి చెయ్యి అడ్డం పెట్టి బ్యాలెన్స్ తప్పకుండా నిలువరించారు. వెంటనే సిబ్బంది చెయ్యి అడ్డుపెట్టి చంద్రబాబును కాన్వాయ్ వద్దకు తీసుకెళ్లారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఈ ఆర్థిక సంవత్సరం భారం ఉండదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కాల్వలో కొట్టుకుపోయిన చిన్నారి

కాట్రేనికోన, జనవరి 29: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుంచనపల్లి వద్ద బొబ్బర్లంక- పల్లంకుర్రు పంటకాల్వలో సోమవారం ఆరేళ్ల చిన్నారి కొట్టుకుపోయినట్టు స్థానికులు తెలిపారు. సంచార జాతులకు చెందిన కుటుంబం ఇక్కడ గుడారంలో నివాసముంటున్నారు. తల్లిదండ్రులు లేని సమయంలో చిన్నారి స్నానం కోసం కాల్వలోకి దిగి అదృశ్యమైనట్టు తెలుస్తోంది. ఎంత గాలించినా పాప ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం పక్కన ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సీఐ విజయ్‌శంకర్ తెలిపారు. ఆర్‌పీఎస్ఐ పెబ్బిలి లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627551 నెంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

పాలకమండలి సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

అన్నవరం, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం లభించింది. చైర్మన్ రోహిత్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈవో రామచంద్రమోహన్ ప్రతిపాదించిన అజెండాపై సభ్యులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కొండదిగువ టోల్‌గేట్ నుంచి సెంటినరీ కాటేజీ వరకు నిర్మించ తలపెట్టిన మెట్లమార్గం అంచనా వ్యయాన్ని రూ.85 లక్షల నుంచి రూ.90 లక్షలకు పెంచేందుకు ఆమోదం లభించింది. రూ.40 లక్షలతో టోల్‌గేట్ వద్ద నుంచి సత్యగిరి జంక్షన్ వరకు ఘాట్‌రోడ్డు పాడవడంతో బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న విద్యాసంస్థల్లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జీతభత్యాలకు రూ.90 లక్షలు సప్లిమెంటరీ బడ్జెట్‌కు అనుమతి కోరుతూ ప్రతిపాదించగా నిర్ణయాన్ని కార్యనిర్వహణాధికారికి వదిలివేశారు. సత్యగిరి కొండపై నిర్మించిన శివసదన్ కాటేజీ నందు సూట్‌రూంల అద్దెను 2000 నుంచి 2500కు పెంచాలని నిర్ణయించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ఆదిశంకర్ మార్గ్‌కు భద్రతా ప్రమాణాల దృష్ట్యా రూ.11.91 లక్షలతో క్రాస్ బేరియర్స్ ఏర్పాటుకు పిలిచిన లోయస్టు టెండర్ ఆమోదించారు. రూ.9 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపునకు బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదం లభించింది. ఇటీవల దేవస్థానంలో వాహనాల కొనుగోలుకు సంబంధించి అవసరమైన ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు కండక్టర్‌లు, ఒక క్లీనర్‌ను ఔట్‌సోర్సింగ్‌పై తీసుకోవాలనే అంశాన్ని ఆమోదించి కమిషనర్ అనుమతి తీసుకోవాలని సూచించారు. రూ.26 లక్షలతో దత్తత ఆలయమైన శంఖవరం ఉమామహేశ్వర దేవస్థానంలో కల్యాణ మండపం అభివృద్ధి పనులు చేపట్టడంపై నియమ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. రూ.3.90 లక్షలతో మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఘాట్‌రోడ్డు పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల పలు వ్యాపార సముదాయాల లైసెన్స్ హక్కులకు నిర్వహించిన వేలం పాటలలో హెచ్చుపాటలను ఆమోదించారు. సమావేశంలో సభ్యులు పేరూరి బద్రీనారాయణ, నక్కా అశ్విని, దోమాడ సుందరరావు, సహాయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలి సమావేశం జరుగుతున్న దృశ్యం

'ప్లాపస్' సేవలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్(ప్లాపస్) సేవలు ప్రజలు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ప్లాపస్‌పై ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులతో ఆమె సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం-1987 ద్వారా ఏర్పాటు చేసిన ప్లాపస్ విధులను వివరించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ వంటి పది రకాల సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్లాపస్ ద్వారా త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్లాపస్‌కు రూ.కోటి రూపాయల వరకూ వివాదాలు పరిష్కరించే పరిధి ఉందన్నారు. అర్జీదారులు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, రాజీ మార్గంలో వివాద పరిష్కారానికి ప్రయత్నం చేస్తారన్నారు. ఒకవేళ రాజీ కుదరని పక్షంలో విచారణ జరిపి తీర్పు ఇచ్చే అధికారం ప్లాపస్‌కి ఉందని పీడీజే తెలిపారు. ప్లాపస్‌పై ప్రజలు కూడా అవగాహన పెంచుకొని సేవలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ప్లాపస్ చైర్‌పర్సన్ ఏ.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, డీఈవో ఎస్.అబ్రహాం, కోనసీమ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, బీఎస్ఎన్ఎల్ జేఏవో వై.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

సాహిత్యం ఉన్నంతకాలం వేటూరి ఉంటారు

● వేటూరి సాహితీ పీఠం పురస్కార గ్రహీత జేకే భారవి

తుని రూరల్, జనవరి 29: 'కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే'.. ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం వేటూరి మాత్రమే చేయగలరని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే.భారవి అన్నారు. సంగీతం, సాహిత్యం ఉన్నంతవరకు వేటూరిని మరిచిపోలేమని అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేటూరి జయంతి వేడుకల్లో ఈ ఏడాది త్రయోదశ(13వ) వేటూరి కవితా పురస్కారాన్ని జేకే భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి వారి పురస్కారానికి తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాశాలున్నాయని చెప్పారు. కవులకు ధనం ముఖ్యం కాదని, వారి వారి వాక్చాతుర్యం, రచనా శైలి నిజమైన సంపద అని అన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాలకంటే ఆదిశంకరాచార్య సినిమాకు యూట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండడం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానని అన్నారు. తెలుగు పాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కోదూరి రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామ ప్రభు మాట్లాడుతూ వేటూరి మన మధ్య లేకపోయినా పాటల రూపంలో బతికే ఉన్నారని, కవులు ఉన్నంతకాలం తెలుగు భాష వైభవం తగ్గదని అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జేకే భారవిని తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు పుష్పకాలతో ఘనంగా సత్కరించారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితి పీఠం ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.



జేకే భారవిని సత్కరించిన ప్రముఖులు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

⇒ 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలానికి ఒక్కరూ మాత్రమే డీలర్ కావలెను. సంప్ర॥ 9490679396, 9493786468.

AJG-184167

CHANGE OF NAME

★ I, CHEEKATLA PREM KUMAR, S/o. CHEEKATLA JAMES, D.NO: 3637, JLB NAGAR, BOMMURU, RAJAHMUNDRY 533124, EAST GODAVARI DIST. have changed My name from PREMKUMAR BHARATI CHEEKATLA (old name) to CHEEKATLA PREM KUMAR (new name), hence after all my documents and correspondence will continue with my new name CHEEKATLA PREM KUMAR.

AJV_ 11605

4 Lines CLASSIFIED Rs.230/- Only

మళ్లీ పెద్దపులి జాడలు

విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు



గాలింపు చర్యల పర్యవేక్షణ

నల్లజర్ల, జనవరి 29: పెద్ద పులి వచ్చిన జాడలు మళ్లీ కనిపించినట్టు డీఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నల్లజర్ల మండలం పుల్లలపాడు, నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో పెద పులి సంచరిస్తున్నట్టు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం నిజమైంది. శుక్రవారం ద్వారకాతిరుమల మండలం వైపు వెళ్లిన పెద్ద పులి తిరిగి అయ్యవరం మీదుగా పుల్లలపాడు వైపు వచ్చినట్టు డీఆర్‌వో చెప్పారు. పులి పాదముద్రలు సేకరిస్తున్నామని, ఫెగ్ మార్క్స్ సేకరించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం ఒక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇదిలా ఉండగా ఏలూరు డీఎఫ్‌వో రవీంద్రదామ తన బృందంలో పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం అయ్యవరం-దూబచర్ల గ్రామాల మధ్య ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో పులి పాదముద్రలు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ ట్రాప్ కెమెరా అమర్చారు. ఆయన వెంట డీఆర్‌వో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రత్నం ఉన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం పెరుగూడెంలో పెద్ద పులి ఉన్నట్టు సమాచారం రావడంతో వెంటనే బయలుదేరి వెళ్లారు. తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రెండు పెద్ద పులులు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

క్షుద్ర పూజల కలకలం

పెద్దాపురం, జనవరి 29: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. తమ ఇళ్ల ముందు ముగ్గులు, ఎండు మిరపకాయలు, కుంకుమ, పసుపు మొదలయిన వాటిని పెట్టి క్షుద్ర పూజలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో ఎవరో ఈ పనులు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెలుగుల సురేష్ గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు తెలియచేశారు. గ్రామంలో పోలీసు పహారా ఏర్పాటు చేస్తామన్నారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 29: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వినాయకుడికి సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి సూక్తం, గణపతి ఉపనిషత్ పారాయణం చేసి చెరుకు రసం,పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గణపతి సహస్రంతో పుష్పార్చన అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు నిర్వహించారు.

రాష్ట్రంలో బీసీలపై వైసీపీ ఉక్కుపాదం

» టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం నేతలు

» ప్రత్తిపాడులో జయహో బీసీ సదస్సు



ప్రత్తిపాడు సదస్సులో బీసీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, జనవరి 29: రాష్ట్రంలోని బీసీలపై వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపి వారి హక్కులను కాలరాస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం నేతలు విమర్శించారు. ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలకు చెందిన ఆదరణ వంటి 30 పథకాలు వైసీపీ రద్దు చేసిందన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ బీసీలపైనే దాడులు, అణచివేత, అక్రమ కేసులు పెట్టి హింసిస్తుందని మండిపడ్డారు. బీసీలంతా ఐక్యంగా వైసీపీని ఓడించాలని వారు పిలుపునిచ్చారు. వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ బీసీలు అంటే టీడీపీ అని, టీడీపీకి బీసీలంతా కలిసి కట్టుగా మద్దతు తెలపాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయం, అక్రమాలను ప్రజలకు వివరించి వైసీపీకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పలువురు నాయకులు కోరారు. సమావేశంలో రాష్ట్ర పెరికి సాధికారక సంఘం కన్వీనర్ వన పర్తి బద్రి, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బీమశంకర్ సత్తిబాబు, పైల సాంబశివరావు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, బుద్దాల శ్రీనివాసరావు, పల్లగోపి, మదినే దొరబాబు, రీసు సత్తిబాబు, ఇంధన ఏసుబాబు, రొంగల యమున, జింకల ఫకీర్, లొండా లోవరాజు పాల్గొన్నారు.

రేపు ఏలేశ్వరంలో బీసీ సదస్సు...

ఏలేశ్వరంలోని ఎస్.కన్వెషన్ ఫంక్షన్‌హాల్లో బుధవారం నిర్వహించే జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని మండల బీసీ నాయకుడు, కౌన్సిలర్ మూది నారాయణస్వామి కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశారని, టీడీపీ ప్రభుత్వ హయంలో అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. ఈ సమావేశానికి మండలంలోని బీసీ సోదరులంతా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ నేతలు ధనేకుల వీరభద్రరావు, ఒనుం మంగ, వైభోగుల సుబ్బారావు, బెలాని శ్రీను, పతివాడ రామకృష్ణ, పోరాడ కృష్ణ, జొన్నాడ వీరబాబు, బాబ్జి, త్రిమూర్తులు, గోపి, దేవుడు, రాంబాబు, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం : నవీన్

కాకినాడ సిటీ, జనవరి 29: సీఎం జగన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఆయన్ను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ఎన్నికలకు సిద్ధం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ప్రజలు తగిన రీతిలో స్పందిస్తారన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు చేసిన అన్యాయాలను తట్టుకోలేక ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని ఇంటికి ఎప్పుడు పంపిద్దామా అని వేచి ఉన్నారన్నారు. యుద్ధం ప్రారంభమైందని, ఆ యుద్ధంలో తలపడేందుకు టీడీపీ ఎప్పుడైనా సిద్ధమేనన్నారు. ఈ యుద్ధంలో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమని ఆయన స్పష్టం చేశారు.

'గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి'

కరప, జనవరి 29: ప్రజా సమస్యలను గుర్తించి వాటికనుగుణంగా గ్రామాభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికను రూపొందించాలని కాకినాడ డీఎల్‌పీవో వి.అన్నామణి సూచించారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే ఫిబ్రవరి నెలాఖరు కల్లా ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్లను నూరు శాతం పూర్తిచేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలను పూర్తిస్థాయిలో అమలుచేయాలన్నారు. స్వామిత్వ, పీఎం విశ్వకర్మ పథకం, ఏపీ పీఆర్ పోర్టల్, విద్యుత్ మీటర్ల సర్వే, పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్ష జరిపారు. అనంతరం కరప ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీచేశారు. ఈవోపీఆర్డీ సలాది వెంకటశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలి'

తాళ్లరేవు, జనవరి 29: చొల్లంగి సర్వేనెంబర్ 47లో ఇళ్ల స్థలాలను చొల్లంగి లబ్ధిదారులకే ఇవ్వాలని కోరుతూ పలువురు చొల్లంగి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. టీడీపీ నేత కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగి గ్రామం మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను ఇతర మండలాల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చొల్లంగిలో ఖాళీ స్థలాలను చొల్లంగి లబ్ధిదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గర్రే లక్ష్మీనారాయణ, పులపకూర శ్రీనివాస్, వల్లు నాగసురేష్, మేడపాటి దేవానందం, బొడ్డు రమణ, పులపకూర చినబాబు, లబ్ధిదారులు పులపకూర శాంతి, మానూరి కుమారి, కె.కృష్ణమారి,రాఘవమ్మ ఉన్నారు.

'తెలుగు చిత్రసీమకే వన్నె తెచ్చిన అంజలీదేవి'

పెద్దాపురం, జనవరి 29: తెలుగు చిత్ర పరిశ్రమకే వన్నె తెచ్చిన గొప్ప నటి అంజలీదేవి అని అంజలీదేవీ ఫౌండేషన్ కన్వీనర్ పొలమరశెట్టి సత్తిబాబు అన్నారు. స్థానిక పాత బస్‌స్టాండ్ సమీపంలో అంజలీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంజలీదేవి వర్థంతి సభలో ఆయన ముందుగా అంజలీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకతను చాటిచెప్పిన గొప్ప నటి అంజలీదేవి అన్నారు. ఆమె పెద్దాపురంలో జన్మించడం చాలా గొప్ప విషయమన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాసం శెట్టి గంగ, కౌన్సిలర్ గోళ్ల విజయలక్ష్మి, బాబీ, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

'లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి'

పిఠాపురం, జనవరి 29: లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా చదవాలని సైకాలజీ ప్రొఫెసర్ సత్యశీరిష సూచించారు. సెట్రాజ్ సౌజన్యంతో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగంలో ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం సెమినార్‌లో ఆమె విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డెసిషన్ మేకింగ్, థింకింగ్ ఎలా ఉండాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి కేశవరావు, సెట్రాజ్ డైరెక్టర్ సీహెచ్‌వీ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ గౌతమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు దేవరపల్లి కాశీవిశ్వనాథం, వి.బుల్లిప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

'మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

ప్రత్తిపాడు, జనవరి 29: ఏలేశ్వరం మండలంలోని గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి)చెప్పారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రామైక్య సంఘాల సమావేశం నిర్వహించారు. మండలంలోని జలజీవన మిషన్‌కు చెందిన పనులను గ్రామ జల సంఘం కమిటీలు, గ్రామైఖ్యసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కనిగిరి రాఘవేంద్ర, ఏఈ శ్రీరాం పాల్గొన్నారు.

'సాగుదారుల పేర్లు నమోదు చేయాలి'

రౌతులపూడి, జనవరి 29: ప్రభుత్వ భూముల్లో సాగుదారుల పేర్లు నమోదు చేసి హక్కులతో పట్టాలు ఇవ్వాలని సీపీఐ కేంద్రకమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు డిమాండ్ చేశారు. రౌతులపూడిలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. పారుపాక, కోదూరు, ఎస్.అగ్రహారం గల ప్రభుత్వ భూముల్లో సాగుదారుల పేర్లు నమోదు చేయాలన్నారు. సీపీఐ మండలాధ్యక్షుడు సామిరెడ్డి నారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కే.జనార్ధన్ ఉన్నారు.

మెగా క్రికెట్ కప్ విజేత పిఠాపురం జట్టు

కొత్తపల్లి, జనవరి 29: కొత్తపల్లి మండలంలో పొన్నాడ శివారు రావివారిపోడు గ్రామంలో జనసేన యువనాయకుడు వేగిశెట్టి సూర్యనిఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో పిఠాపురం జట్టు విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ప్రథమ బహుమతిగా పిఠాపురం జనసేన ఇన్‌చార్జి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ రూ. 50వేలు అందజేశారు. ద్వితీయ బహుమతి (అమలాపురం) జట్టుకు జనసైనికులు బండి బుజ్జి, వరాలు రూ.25వేలు, తృతీయ స్థానం పొందిన మాధవపట్నంకు జనసైనికుడు సూర్యనిఖిల్ రూ.10వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జనసైనికులు బండి బుజ్జి, వరాలు, బండి రమణ ఉన్నారు.

సామాజిక సేవా కార్యకర్తలకు సత్కారం

కరప, జనవరి 29: సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గురజనాపల్లి గ్రామానికి చెందిన మానవత్వం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజు, 88సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలులకు ఘన సత్కారం జరిగింది. తానుబెల్లి ఫౌండేషన్ స్థాపించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెంలో ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ సమావేశంలో సంస్థ ప్రతినిధులు వారిద్దరికీ భారత సేవరత్న అవార్డును అందజేసి గౌరవించారు. అవార్డు పొందిన రాజు, తాతీలులకు మండల గ్రామాలకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జిలకు శిక్షణ

తుని రూరల్, జనవరి 29: తుని టీడీపీ కార్యాలయంలో తుని మండల, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణను పి.రమణ, పి.శివరామకృష్ణ, కె.చంద్రశేఖర్ నిర్వహించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, తుని పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి మళ్ళ గణేష్, తుని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చిటికెన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ అంకంరెడ్డి నానబ్బాయి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఆసరా' చెక్కుల అందజేత

గొల్లప్రోలు, జనవరి 29: గొల్లప్రోలు పట్టణంలో సోమవారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 381 మహిళా సంఘాలకు మంజూరైన రూ.3.22కోట్ల చెక్కును మహిళలకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందజేశారు. చేబ్రోలులో జరిగిన కార్యక్రమంలో గొల్లప్రోలు మండలంలోని 956 సంఘాలకు మంజూరైన రూ6.36కోట్లును వారు లబ్ధిదారులకు అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి, జనవరి 29: మండలంలో నీలాద్రిపేట గ్రామానికి చెందిన నక్కా భవానీ ప్రసాద్(34) ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగడంతో అతడిని కుటుంబీకులు రాజమహేంద్రవరం జీఎస్ఎల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనిపై ఏఎస్ఐ రామారెడ్డి కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ అండ్‌సీ 1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ 2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

పేలిన ఎలక్ట్రిక్ బైక్

కాకినాడ క్రైం, జనవరి 29: కాకినాడ రూరల్ మండలం మహాలక్ష్మి నగర్‌కు చెందిన రమేష్ ప్యూర్ కంపెనీకి చెందిన తన ఎలక్ట్రిక్ బైక్‌కు సోమవారం రాత్రి తన ఇంటిలో చార్జింగ్ పెడుతుండగా భారీ శబ్దంతో విస్ఫోటనం జరిగింది. ఇంట్లో ఖరీదైన గృహోపకరణాలన్నీ తునాతునకలయ్యాయి. రమేష్ గాయాలపాలవగా జీజీహెచ్‌కు తరలించారు. ఏడీఎఫ్‌వో ఏసుబాబు సిబ్బంది, శకటంతో సంఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఆస్తినష్టం సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



జగ్గంపేట:టీడీపీలోకి చేరినవారితో జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జనవరి 29: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో వైసీపీ నుంచి 500 మంది టీడీపీలో చేరారు. నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, ధాన్యం అమ్ముకోలేని స్థితిలో ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, విద్యా, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ఆయన్ని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, అడబాల భాస్కరరావు, సూరంపాలెం బాలు, జోషుల రాంబాబు, జంపన సీతారామచంద్రవర్మ, వెన్న వీరబాబు, బిక్కిన బాబి, దాపర్తి సీతారామయ్య, సుంకవిల్లి రాజు, బద్ది సురేష్, వెలిశెట్టిబుజ్జి, వెలిశెట్టి శ్రీను, పప్పు గణేష్, దమర్‌సింగ్ మధు, పోలినాటి ధర్మానంద కుమారి, యల్లాటి అమ్మాజీ, గుండుపల్లి సుజాత తదితరులున్నారు.

ఎస్.అన్నవరంలో...

తుని రూరల్: ఎస్.అన్నవరం పంచాయతీ రామకృష్ణ కాలనీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. కేవీఆర్.చలపతిరావు, ఉమ్మిడి దుర్గ, లలిత, ఉక్కిన భవానిలతో పాటు పలు కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు, గొల్లపల్లి రాంబాబు ఉన్నారు.

జనసేనలో చేరికలు

సర్పవరం జంక్షన్, జనవరి 29: కాకినాడ రూరల్ మండలం వాకలపూడి శివారు హార్బరుపేటకు చెందిన మత్స్యకారులు సాగిరెడ్డి వెంకటేశ్వరరావు (పండు నాయుడు), పాలెపు శివ ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీలో చేరారు. వారికి కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే నేమాం శివారు గుత్తులవారిపాలెంలో పార్టీ మండల కార్యదర్శి పోసిన రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి శివల ఆధ్వర్యంలో 25 మంది పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు మాదారపు తాతాజీ, నరాల ఈశ్వరరావు, పెంకే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జనంలోకి జనసేన కార్యక్రమం

ప్రత్తిపాడు, జనవరి 29: ఏలేశ్వరం మండలం టి.రాయవరం గ్రామంలో సోమవారం ప్రత్తిపాడు జనసేన పార్టీ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జనసేన మేనిఫెస్టో అంశాలు, పార్టీ అధినేత పవన్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు వివరించారు. జనసేన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్, మండలాధ్యక్షుడు కాలారి శ్రీను, ఉపాధ్యక్షుడు పలివెల వెంకటేష్, నాయకులు కోలా వీరబాబు, కాపారపు సురేష్, బొట్ట సురేష్, మొల్లి కృష్ణ పాల్గొన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, జనవరి 29: జగ్గంపేట ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఏడాదిగా ప్రతి సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆర్థిక సాయంతో సమకూర్చిన భోజనాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, హజరై పేదలకు అన్నం వడ్డించారు. జీను మణిబాబు, కొత్త కొండబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, చిటికెట కన్నబాబు, దాపర్తి సీతారామయ్య, బొండా రాజేష్, బొండా శ్రీనుబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, బద్ది సురేష్ పాల్గొన్నారు.

'సర్పంచ్ వ్యవస్థ నిర్వీర్యం'

ప్రత్తిపాడు, జనవరి 29: సర్పంచ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని నియోజకవర్గ సర్పంచ్ సమాఖ్యల అధ్యక్షుడు మంతెన వెంకటరమణ(శ్రీను) విమర్శించారు. ప్రత్తిపాడులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 73, 74రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నా విధులు, నిధులు, అధికారాలను వైసీపీ పక్కదారి పట్టించిందన్నారు. పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తమ డిమాండ్ల సాధనకు అమలాపురంలో నిరసన దీక్ష చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

వ్యక్తికి కాలిన గాయాలు

జీజీహెచ్(కాకినాడ), జనవరి 29: నిప్పుతో చెలగాటమాడిన ఓ వ్యక్తి తీవ్ర కాలిన గాయాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన పాలూరి బాలసుబ్రమణ్యం(32) తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గంగనాపల్లి సెంటర్‌కు వచ్చేసరికి వాహనంలో ఇంధనం అయిపోయింది. అతడు నడుచుకుంటూ స్థానిక బంక్ వద్దకు వెళ్లి సీసాలో పెట్రోల్ తెచ్చాడు. ఈక్రమంలో సీసా మూత విప్పి ట్యాంక్‌లో పెట్రోల్‌ను ఓ చేతితో వేస్తూ మరో చేతితో సిగరెట్ కాలుస్తున్నాడు. సిగరెట్ నిప్పు రవ్వ పెట్రోల్‌లో పడడంతో ఒక్కసారిగా పెద్దగా మంటలు రాజుకుని క్షణాల్లో బాలసుబ్రమణ్యం దేహం 60శాతం మేర కాలిపోయింది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం

పెద్దాపురంలో కౌన్సిలర్ల ఆవేదన



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

పెద్దాపురం, జనవరి 29: వార్డుల్లోకి వెళ్లలేకపోతున్నాం, ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం ఇలా అయితే ఎలా అని మున్సిపల్ అధికారులను పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవ రావు మాట్లాడుతూ సుమారు నాలుగేళ్లుగా తన వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ప్రజలకు తాము ఏం సమాధానం చెప్పాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ స్థానిక బూస్టర్ పాయింట్ వద్ద భవనం నిరుపయోగంగా ఉందని దానిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ సూరంపాలెం జగనన్న లేఅవుట్‌లో సమస్యలను పరిష్కరించాలని, రెండోవిడత టిడ్కో గృహాలను ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అనంతరం పలువురు సమస్యలపై ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

నాగులాపల్లి (కొత్తపల్లి), జనవరి 29: గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడిని ఎన్నుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాగులాపల్లిలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు సూపర్‌సిక్స్ కరపత్రాలను వర్మ పంపిణీ చేశారు. ప్రతీ వీధిలో పర్యటిస్తూ ప్రజాసమస్యల పట్ల అవగాహన ఉన్న నాయకులనే ఎన్నికల్లో ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. ప్రస్తుతం నియోజవర్గంలో ప్రజాప్రతినిధులు రైతు సమస్యలను ప్రజాసమస్యలను గాలికి వదిలేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏలేరు ప్రాజక్టును ఫేజ్2లో ఆధునికీకరించేందుకు రూ.150 కోట్లతో ప్రారంభించిన పనులను వైసీపీ ఎమ్మెల్యే ఎంపీలు రద్దు చేశారని ఆరోపించారు. ఏలేరులో 3టీఎంసీ నీటిని తుని,తాండవకు ధారా దత్తం చేశారని విమర్శించారు. పేదల కష్టాల్లో వెన్నంటే ఉండి, సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసే తనను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని వర్మ ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి,టీడీపీ కార్యకర్తలున్నారు.


'విద్యుత్ చార్జీల నుంచి వెసులుబాటు కల్పించాలి'

సామర్లకోట, జనవరి 29: రాష్ట్రంలో కేవలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే పది మిల్లుల వరకూ ఉత్పత్తులు సాగిస్తున్న సగ్గుబియ్యం మిల్లులకు విద్యుత్ చార్జీల నుంచి వెసులుబాటు కల్పించాలని ఆంధ్రాశాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నెక్కంటి సత్యన్నారాయణ, తిలక్, నరసింహారావు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ.నాగార్జునరెడ్డి, మండలి సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీ.వెంకటరామారెడ్డిని కోరారు. తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ నియంత్రణ మండలి సోమవారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రభాకర్ తన చాంబర్ నుంచి కాన్ఫరెన్స్‌కు అనుసంధానం అయ్యారు. ఇందుకు సగ్గుబియ్యం మిల్లర్లు హాజరై తాము ఎదుర్కొంటున్న విద్యుత్ చార్జీల భారాన్ని వివరించారు. ఏడాదిలో కేవలం నెల నుంచి నలభై రోజులు మాత్రమే సగ్గుబియ్యం ఉత్పత్తులు జరుగుతాయని ఏడాదంతటికీ 250 కెవీఏ కాంటాక్ట్ లోడ్‌కు చార్జీలు, డిపాజిట్లు చెల్లించాలని విద్యుత్ అధికారులు ఆదేశించడం వల్ల ఒక్కొక్క మిల్లరూ రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల మేర అదనపు భారాన్ని మోయాల్సిఉంటుందని వాపోయారు. దీనిపై విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ దీనిపై సమగ్రంగా లేఖ అందజేయాలని సాధ్యాసాధ్యాలు సమీక్షించి ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవడం జరుగుతుందని హామీఇచ్చారు. విద్యుత్ ఈఈ ప్రభాకర్, ఏడీఈ కిరణ్, జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ చైర్మన్ నూతలపాటి అప్పలకొండలు పాల్గొన్నారు.

సెబ్ దాడుల్లో అక్రమ మద్యం స్వాధీనం

కాకినాడ క్రైం, జనవరి 29: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుబడింది. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్(ఏఈఎస్) అజయ్‌కుమార్ సింగ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ డివిజనల్ టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్‌కు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం కాకినాడ జగన్నాథపురం సమీపంలో ఏఈఎస్ బృందం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో యానాం నుంచి కాకినాడ వైపు వేగంగా వెళ్తున్న పాసింజర్ ఆటోను సెబ్ అధికారులు, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 174 బీరు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. అనంతరం పెద్దాపురం మండలం నాగంపేటకు చెందిన ఆటోడ్రైవర్ నందిపు నూకరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో యానానికి చెందిన సామాన గంగాప్రసాద్‌ను, కత్తిపూడికి చెందిన మచ్చా వీరబాబును అరెస్ట్ చేయాల్సి ఉందని ఏఈఎస్ సింగ్ తెలిపారు. సెబ్ సీఐ పి.సునీల్‌కుమార్, అధికారులున్నారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా గగారిన్



సర్పవరం జంక్షన్, జనవరి 29: కాకినాడ రూరల్ రాయుడుపాలెనికి చెందిన జంగా గగారిన్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి సోమవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఎమ్మెల్యే కన్నబాబు, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గగారిన్‌ని కాకినాడ రూరల్, కరప జడ్పీటీసీలు నులుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, పెంకే శ్రీలక్ష్మి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి అభినందించారు.

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటన

కరప, జనవరి 29: మండలంలోని వేములవాడలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం పర్యటించి అనారోగ్యంతో మృతిచెందిన మీసాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న దూడల శ్రీనును పలకరించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ కమిడి మంగాదేవి శంకర్, మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉద్దండ సూర్యనారాయణ, బండే తాతాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబు అనుచరుల సమావేశం

జగ్గంపేట, జనవరి 29: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రధాన అనుచరులు సోమవారం సమావేశం అయ్యారు. వైసీపీ నాయకులు కంచి లక్ష్మణదొర, ఇళ్ళ అప్పారావు ఆధ్వర్యంలో భావవరం గ్రామంలో నిర్వహించిన సమావేశానికి నియోజకవర్గంలోని పలువురు సర్పంచ్‌లు జడ్పీటీసీలు, వైసీపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. జ్యోతుల ఏపార్టీలో కొనసాగితే అదేపార్టీలో తాము కొనసాగుతామన్నారు.

పెద్దాపురంలో 'స్పందన'

పెద్దాపురం, జనవరి 29: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవో జె.సీతారామారావు ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. స్పందనలో సమస్యలను సత్వరమే పరిష్కరించుకునే వీలుంటుందని తెలిపారు.

ఎన్నికల విధులకు సిద్ధం : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

పెద్దాపురం, జనవరి 29: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులంతా సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టినట్టు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలు కేసులకు సంబంధించిన వివరాలను డీఎస్పీ లతాకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరిం చాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఉన్నారు.

పాదగయలో ఎంపీ పూజలు

పిఠాపురం, జనవరి 29: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ దంపతులు సోమవారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆగంటి ప్రభాకరావు, ఈవో వడ్డి శ్రీనివాసరాలు ఎంపీ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు..

నేడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు

పిఠాపురం, జనవరి 29: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం త్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవాలు జరగనున్నాయి. ఉదయం త్యాగరాజస్వామికి ప్రత్యేక పూజలు అనంతరం సంగీత కళాకారులు పంచరత్న కీర్తనలు ఆలపించడం జరుగుతుందని త్యాగరాజ సంగీత సమాఖ్య సభ్యులు తెలిపారు. సంగీత కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

కొత్తపల్లి, జనవరి 29: కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాధ్ ఆధ్వర్యంలో బుధవారం నాగులాపల్లిలో వికాస నేతృత్వంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి తెలిపారు. నాగులాపల్లి పరిసరగ్రామాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

గండేపల్లి, జనవరి 29: సూరంపాలెంలోని ఆదిత్య విద్యాప్రాంగణంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు. విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజ్యం జన్మదినం, ఆదిత్య వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల సౌజన్యంతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

సామర్లకోట ఎంపీడీవో బదిలీ

సామర్లకోట, జనవరి 29: సామర్లకోట ఎంపీడీవోగా పనిచేస్తున్న డి.శ్రీలలిత తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఎంపీడీవోగా బదిలీ చేస్తూ జడ్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా సామర్లకోట ఎంపీడీవోగా చోడవరం నుంచి శ్యామ్ సుందర్ రానున్నట్టు సమాచారం.

జానకిరాముడికి నివాళి

తాళ్లరేవు, జనవరి 29: జార్జీపేట నీలాంద్రిపేటకు చెందిన అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, దళిత సాహితీవేత్త కాశి జానకిరాముడు చిత్రపటానికి మాజీ చైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. కుమారుడు కాశి గంగా ప్రసాద్‌ను పరామర్శించారు. సలాది సత్యకృష్ణ, జర్నలిస్టులు విత్తనాల సాంబశివరావు, కముజు ఆనందకుమార్ ఉన్నారు.

కంప్యూటర్ల ప్రారంభం

కరప, జనవరి 29: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి రూ.1.52లక్షలు విలువచేసే నాలుగు అధునాతన కంప్యూటర్లు రాగా సోమవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు ప్రారంభించారు. మండలపరిషత్ కార్యాలయం ఏవో గుత్తుల భీమశంకరరావు, సిబ్బంది వీవీఎన్ వీరేష్, టి.సురేష్, జీవీ చినరాయుడు పాల్గొన్నారు.

GENERAL PUBLICATION

Under instructions from our client M/s. SHRIRAM FINANCE LIMITED, Registered Office at Chennai and Branch Office at II Floor, Super Bazar Complex, Main Road, KAKINADA. We issue this notice to the General Public.

Our client is intending to advance loan to M/s. MODERN CAFE LODGE, KAKINADA rep. by its partners 1) Sri DWARAMPUDI CHANDRASEKHARA REDDY, S/o. Bhaskara Reddy, 2) Smt. DWARAMPUDI MAHALAKSHMI, W/o. Chandrasekhara Reddy, 3) Smt. GUDIMETLA PRANEETHA, W/o. Uday Sekhar Reddy and 4) Smt. DWARAMPUDI ANJANI, W/o. Harsha Vardhan Reddy who agreed to create equitable mortgage relating to the under mentioned schedule property belongs to them.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise, the same is treated as no objection.

SCHEDULE : Previously East Godavari District, Presently Kakinada District, Kakinada Sub-Registry, Kakinada Urban Mandal, Kakinada Municipal Corporation, House and Site bearing D.No.20-13-37 with Assessement No. 1060022064 to an extent of 278⅞ Sq. Yards within the following boundaries with all usufruct, water, ways and all easementary rights: East: Vallabai Street; West: Sunkaravari Street; South: Manthripragada Vari Street; North: House of Katari Subhashini.

G.S.M.N. SWAMY, B.Com, B.L., G.A.S.S. JYOTHI, B.L., Advocates, #8-24-6, BF-1, Gandhi Nagar, KAKINADA - 4. Cell. 9866191397
Kakinada
Dt: 29-01-2024

కెనరా బ్యాంక్ | మధురానగర్ బ్రాంచ్ (13823) ఫోన్: 0884-2356362, 8332959362

సీల్డ్ టెండర్/బహిరంగ వేలం ద్వారా వాహనము వేలం

కారు వివరములు	రిజర్వు ధర
HONDA WR-V 1.2 VX MT (I-VTECH), REG NO: AP39RW2689, ENG. NO: L12B47705282, CHASIS NO: MAKGL176LN4303658	రూ. 7,00,000/-
	ధరావత్తు: రూ. 70,000/-
	బిడ్ పెంపుదల: రూ. 10,000/-

ఋణగ్రహీత: శ్రీ పొట్నూరి శ్రీకాంత్, తేది 31.12.2023 నాటికి బకాయి: రూ.9,91,147/-

• వాహనం తనిఖీ కొరకు తేది 09-02-2024, సా॥ 5.00 గం॥లోపూగా బ్రాంచ్ నందు సంప్రదించవలెను. • వేలము తేదీ, సమయము: 14-02-2024 ఉ॥ 11:30 గం॥లకు (ధరావత్తు సొమ్ము తేది 13-02-2024, సా॥4:00 గం॥ల లోపు చెల్లించవలెను). • వేలం వేయు ప్రదేశము: కెనరా బ్యాంక్, మధురానగర్ బ్రాంచ్, కాకినాడ. • ధరావత్తు డ్రాఫ్ట్: "కెనరా బ్యాంక్, మధురానగర్ బ్రాంచ్" పేరున తీయవలెను. లేనిచో "కెనరా బ్యాంక్, మధురానగర్ బ్రాంచ్ వారి A/c No.209272434, IFSC Code:CNRB0013823" ద్వారా జమచేయవచ్చును. • "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" పద్ధతిలో విక్రయించబడును. • బ్యాంక్ సంతృప్తి మేరకు కె.వై.సి. డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించవలెను. • వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు.

తేది: 25.01.2024 సం/- అధీకృత అధికారి

